## సఫిల్‌గూడ చెరువును అభివృద్ధి చేయాలి



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హెచ్ఎండీఏ జాయింట్ డైరెక్టర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

**మల్కాజిగిరి, జూన్ 10:** సఫిల్‌గూడ చెరువును అభివృద్ధిచేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్‌లో ప్రజావాణిలో సఫిల్‌గూడ చెరువును అభివృద్ధిచేయాలని కోరుతూ హెచ్ఎండీఏ జాయింట్ డైరెక్టర్ ఆమ్రపాలికి కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌లో పబ్లిక్ టాయిలెట్స్, ఫుట్‌పాత్, లైట్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులోని గుర్రపు డెక్క వల్ల దోమల వృద్ధి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గుర్రపు డెక్కను తొలగించి, సుందరీకరించాలని అన్నారు. నాలాలలో పూడిక తీతపనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



మూడుచింతలపల్లిలో విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీమ్ బృందం.

**శామీర్‌పేట, జూన్ 10:** గడువు దాటిన నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ ఏడీఏవవెంకటరాంరెడ్డి హెచ్చరించారు. మూడుచింతలపల్లి మండలంలోని విత్తన దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. నకిలీ విత్తనాలు, గడువు దాటిన విత్తనాల విక్రయాన్ని అరికట్టేందుకే టాస్క్ ఫోర్స్ టీమ్ తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. రైతులకు విత్తనాలు విక్రయించిన వెంటనే బిల్లులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతులు, పంట కాలం పూర్తి అయ్యేవరకు బిల్లులను భద్రపరుచు కోవాలన్నారు. అదే విధంగా దుకాణాల్లో ఉన్న స్టాక్ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ యాదగిరి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేశ్, మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## 'భగీరథ' సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి



మిషన్ భగీరథ నీటి సర్వేపై అగాహన కల్పిస్తున్న అధికారులు.

**శామీర్‌పేట, జూన్ 10:** మిషన్ భగీరథ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని డీఈ అర్చణ, ఎంపీపీ ఎల్లూభాయిబాబు సూచించారు. శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ నీటి సరఫరాపై శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలా అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి ప్రభుత్వం అందజేస్తున్న మిషన్ భగీరథ నీటిపై సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వేను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వాదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రవళి, జడ్పీటీసీ అనిత, ఎంపీడీవోలు మమతభాయి, వత్సలాదేవి, మిషనత్ గీరథ, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

## బొమ్మరాశిపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బొమ్మరాశిపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందుజ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు.

**శామీర్‌పేట, జూన్ 10:** జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మములు స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందుజ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు గిరి అన్నారు. త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి హిందుజ్ఞాన వేదిక పులివెందుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామంలో త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రమీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందుజ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు శ్రీనివాసచారి, జనార్దన్‌రావు, అమరేందర్, ప్రతాప్, విజయ, చిత్రభాను, లక్ష్మీ, మంజూల, జ్యోత్స్న, నవ్యశ్రీ మధు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కృషి హోమ్స్ విద్యార్థుల అదృశ్యం



గణేశ్, సన్నీ సామ్యూల్(ఫైల్)

**మేడ్చల్, జూన్ 10:** మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో ఉన్న కృషి హోమ్స్‌లో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం. ..వనపర్తి ప్రాంతానికి చెందిన 8వ తరగతి చదివే గణేశ్, 4వ తరగతి చదివే కుషాయిగూడకు చెందిన సన్నీ సామ్యూల్ సోమవారం ఉదయం 8గంటల ప్రాంతంలో కృషి హోమ్స్ నుంచి ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయారు. నిర్వాహకులు వారి కోసం పరిసర ప్రాం తాల్లో వెతికారు. స్నేహితుల వద్ద వాకబు చేశారు.అయినా ఆచూకీ లభించలేదు. దీంతో మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

**మల్కాజిగిరి, జూన్ 10:** గుర్తు తెలియన వృద్ధుడు మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... లోతుకుంటలోని ఐటీఐ ట్రైనింగ్ సెంటర్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు(60), మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొని సర్కిల్ డీసీ రాజుతో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



బోడుప్పల్: ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రామలింగం.

# ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి


- వెల్లువలా వచ్చిన వినతులు
- అర్జీలు స్వీకరించిన అధికారులు
- సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఆదేశం



ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు



జవహర్‌నగర్: ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి



అన్నోజిగూడలో ఇంటి సమస్యపై పోచారం కమిషనర్‌కు దరఖాస్తు అందిస్తున్న బాధితుడు

**మల్కాజిగిరి, జూన్ 10:** ప్రజల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని డీసీ రాజుతో కలిసి ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, బాక్స్ డ్రైనేజీ, డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నల్లా కనెక్షన్‌లను మంజూరు చేసి నీటి సరఫరాను మెరుగుపరచాలని సూచించారు. ఆర్టీసీ కాలనీ మెయిన్ రోడ్డులో సీసీ రోడ్డు వేయడానికి ఉన్న రోడ్డును తవ్వేసి వదిలేశారని, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే సీసీ రోడ్డు వేయాలని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, ఏసీపీ శ్రీనివాస్, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, పరశురాంరెడ్డి, అంజయ్య, రాముయాదవ్, జీకే హన్మంతరావు, భాగ్యనంద్, అమీనుద్దిన్, ప్రభాకర్ గౌడ్, బాలకృష్ణ, సతీష్, ఇబ్రహీం, ఉస్మాన్, శివకుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

● **ఉప్పల్:** ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పలువురు ఫిర్యాదులు చేశారు.ఈ సందర్భంగా వినతిపత్రాలు అందజేశారు. పన్నులు, శానిటేషన్, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, డీఈ చందన, సూపర్‌వైజర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** పోచారం,ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు అందాయి.పోచారం మున్సిపాలిటీలో 12 దరఖాస్తులు అందినట్లు కమిషనర్ వేమన రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 27 దరఖాస్తులు అందినట్లు కమిషనర్ సాబేర్ అలీ వివరించారు.

● **బోడుప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ రామలింగంకు,సంబంధిత అధికారులకు ప్రజలు సమస్యలపై ఏకరువు పెట్టారు.వక్ఫ్‌బోర్డు, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 39 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగం, ప్రజాపాలనకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ రామలింగం తెలిపారు.కార్యక్రమంలో డీఈలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, జలమండలి, శానిటేషన్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

● **పీర్జాదిగూడ:** ప్రజావాణిలో 32 ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెల్లి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ జ్యోతి, ఏఈ భిక్షపతి, టీపీఓ ఆలిపాష, విద్యుత్, జలమండలి, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

● **కాప్రా:** కాప్రాసర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి మూడు ఫిర్యాదులు, ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్టు డీసీ ముకుందరెడ్డి వెల్లడించారు.

● **జవహర్‌నగర్:** జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఫిర్యాదులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు:ఎమ్మెల్యే

**చర్లపల్లి, జూన్ 10:** వాణిజ్య వ్యాపార సముదాయాలు, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులలో అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలోని డీమార్ట్ నుంచి శివసాయినగర్ వరకు ట్రాఫిక్ అధికారులు, కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుషాయిగూడ డీమార్ట్ నుంచి శివసాయినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని వ్యాపార సముదాయాల ముందు అక్రమ పార్కింగ్ పట్ల తగు చర్యల తీసుకుంటామన్నారు. కాలనీల్లో వ్యాపార వాణిజ్య సముదాయాలతో నిత్యం పార్కింగ్ సమస్యలను స్థానికులు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, సమస్య వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. డివిజన్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, సీసీఎస్ ప్రతినిధి పద్మారెడ్డి, నాయకులు మహేశ్‌గౌడ్, నాగేశ్వర్‌రావు, కనకరాజుగౌడ్, నర్సింహరెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, కర్రె సత్యనారాయణ, కనకయ్య, శ్రీశైలం, దయాకర్‌రెడ్డి, వెంకటేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ శివసాయినగర్‌లో పర్యటించి అక్రమ పార్కింగ్‌పై సంబంధిత అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

**మల్కాజిగిరి, జూన్ 10:** బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని అల్వాల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ సూచించారు. సోమవారం అల్వాల్ సర్కిల్ పీస్ కమిటీ సభ్యులతో బక్రీద్ పండుగ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాహుల్ దేవ్ మాట్లాడుతూ పండుగలు సోదరభావంతో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మోసిన్, రషీద్ ఖాన్, ఫయాద్‌బాయ్, ఆరీఫ్ అహ్మద్, జేజ, అతిక్ పాషా, ఫఫీ, ఆక్రమ్, జావిద్, రహేమాన్ పాల్గొన్నారు.



పీస్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్

## 'బడిబాట' మండల స్థాయి కమిటీ ఏర్పాటు



మండల పరిషత్ కార్యాలయంలో బడిబాట మండల కమిటీ కోసం నిర్వహించిన సమావేశం

**కీసర, జూన్ 10:** బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో గ్యామా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి బడిబాట కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, తహసీల్దార్,ఎంఈవో, పోలీస్ ఇన్‌స్పెక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌చేత మండల స్థాయి బడిబాట కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాల్లో ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శిక్షణ ఏర్పాటు చేయాలని కోరారు. బడిబాటలో భాగంగా చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ప్రతి ఉపాధ్యాయుడు బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించే కనీస బాధ్యతను తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రధానోపాధ్యాయులందరు చక్కటి కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శశిధర్, ఎంపీవో, ఎస్సైలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### నీటి సమస్య లేకుండా చూసుకోవాలి

ప్రతి గ్రామంలో వాటర్ సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని మండల ఎంపీడీవో గ్యామా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వాటర్ సప్లయ్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నీటి సమస్య లేకుండా పంచాయతీ కార్యదర్శులందరు గ్రామంలో విధిగా తిరిగి పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నందకిశోర్, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంప్ రన్నరప్‌గా..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి జూన్ 10 : నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్ రన్నరప్ టైటిల్‌ను హైదరాబాద్ సూపర్ కింగ్స్‌గా హాస్పిటల్స్ జట్టు నిలిచింది. ముంబై క్రికెట్ స్పార్టాన్స్ హాస్పిటల్స్ జట్టు టైటిల్‌ను దక్కించుకుంది. సోమవారం రాజేంద్రనగర్‌లోని విజయ్ ఆనంద్ క్రికెట్ మైదానంలో మైటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్స్‌లో ముంబై హాస్పిటల్స్ జట్టు ఐదు వికెట్ల తేడాతో హైదరాబాద్ హాస్పిటల్స్ జట్టు పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ హాస్పిటల్స్ జట్టు 143 పరుగులు చేసింది. ముంబై హాస్పిటల్స్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. విజేతలకు నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్‌ను ఫారెస్ట్ నేషన్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శరత్ నలమోతు, మైటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే, కో డైరెక్టర్ నిఖిల్ సంపత్, ఇంతియాజ్ బేగ్ తదితరులు ట్రోఫీని అందజేశారు.

## ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అథ్లెటిక్స్ చాంప్‌కు శ్రీకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి జూన్ 10: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్-2024 ఎఫిషియెన్సీ స్కిల్ రన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్-2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ ప్రారంభించారు. పురుషుల విభాగం 100, 800 మీటర్ల పరుగులతో పాటు షాట్‌పుట్, లాంగ్ జంప్ నిర్వహించారు. అనంతరం నైపుణ్యం పరీక్షలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జే.ప్రభాకర్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి మనోవర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు-నివారణ చర్యలపై కరపత్రం ఆవిష్కరణ

కొండాపూర్, జూన్ 10:సీజనల్ వ్యాధులు - నివారణ చర్యలపై ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని సోమవారం కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో జిల్లా వైద్య సేవల సమన్వయకర్త సివిల్ సర్జన్ డాక్టర్ రాజు యాదవ్ దవాఖానలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మారబోయిన సదానంద యాదవ్, వాణి సాంబ శివరావు, ధర్మసాగర్, బాలన్న, జాకీర్ పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్

**ఉప్పల్, జూన్ 10:** వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ సూచించారు. చిలుకానగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్‌తో ఆలస్యమైన పనులు సత్వరం పూర్తిచేయాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా చూడాలని, డ్రైనేజీ సమస్యలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పూడికతీత పనులు సత్వరం పూర్తిచేసేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, ఏజీఎం సత్యనారాయణ, ఆసీఫ్‌అలీ పాల్గొన్నారు.

## చెట్లకొమ్మలు కొట్టారు..తొలగించడం మరిచారు..



శ్రీరమణపురంకాలనీలో చెట్టుకొమ్మలను తొలగించకుండా రోడ్డుపైనే ఉంచిన దృశ్యం

**ఉప్పల్, జూన్ 10:** విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో చెట్ల కొమ్మలను తొలగించిన విద్యుత్ అధికారులు వాటిని అక్కడి నుంచి తొలగించడం మరిచిపోయారు. దీంతో కాలనీలోని రోడ్లను ఆక్రమిస్తూ, వర్షాల నేపథ్యంలో రోడ్లపైకి చేరుతున్నాయి. కాలనీలోని వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారాయి. మరికొన్ని చోట్ల పుట్‌పాత్‌లపై కొమ్మలను వేయడంతో నడవడానికి వీలులేకుండా మారింది.సరస్వతికాలనీ, శ్రీరమణకాలనీ, సాయిచిత్రనగర్, తదితర ప్రాంతాల్లో చెట్టుకొమ్మలను తొలగించకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చెట్టుకొమ్మల వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## కేంద్రమంత్రిని కలిసిన నేతలు



**ఉప్పల్,జూన్10:** కేంద్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎంపీ బండి సంజయ్‌ను హబ్సిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కక్కిరేణి హరీశ్ సోమవారం కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు.

## కీసరగుట్టలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

**కీసర, జూన్ 10:** కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి గర్భాలయంలో సోమవారం వేదపండితులు మహాన్యాస రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**కీసర, జూన్ 10:** కీసర అనుబంధ గ్రామం అయిన కీసరదాయరలో నూకలగూడెం వెంకట్‌రెడ్డి మృతిచెందాడు. సోమవారం భౌతికాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళురల్పించారు.అనంతరంవారి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్ ముదిరాజ్ పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామంలో మృతిచెందిన గండు సత్తమ్మ కుటుంబానికి కూడా రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

## మౌలిక వసతుల కల్పనకు సహకరించండి

మియాపూర్, జూన్ 10: గచ్చిబౌలి డివిజన్‌లోని పలు కాలనీల్లో సమస్యలను పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటునందించాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జడ్సీ స్నేహ శబరీష్‌ను కోరారు. సోమవారం 'ప్రజావాణి' సందర్భంగా జడ్సీకి మౌలిక వసతుల కల్పనపై జడ్సీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గోపన్‌పల్లి గ్రామం, రాజీవ్‌నగర్ కాలనీ, కేశవనగర్, రాయదుర్గం, నల్లగండ్ల హుడాకాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కాలనీలను అభివృద్ధి పథంలో నడిపించే ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు , తగు నిధులను మంజూరు చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు.లని కోరారు.